సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం | 5 | ఫిబ్రవరి | 2023



20 కిలోల గంజాయి స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

- 8లో▸



మృత్యువులోనూ ..

చిన్ననాటి నుంచి పదో తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులు శనివారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

32.1° /17.9°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి పూట చలి తీవ్రత పెరుగుతుంది.

పట్టాల పంపిణీకి కసరత్తు

- జిల్లాలో పోడు భూములపై తుది కసరత్తు
- అర్హులైన రైతులకు హక్కులు కల్పించేందుకు ఏర్పాట్లు
- జిల్లావ్యాప్తంగా 25,394 దరఖాస్తులు



భూపాలపల్లి అర్బన్: జిల్లాలో పోడు భూములు సాగుచేస్తున్న రైతులకు హక్కులు కల్పించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇప్పటికే గ్రామ, డివిజన్ స్థాయిలో పోడు దరఖాస్తులను పరిశీలించిన అధికారులు అర్హులైన వారికి పోడు భూములపై హక్కులు కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని ఆయా గ్రామాల పరిధిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తూనే అభయారణ్య భూములు, రెవెన్యూ భూములను మినహాయిస్తూ ఇతర భూములను రైతులకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో అటవీ హక్కుల చట్టం కింద వచ్చిన దరఖాస్తులను రెండు విడతల్లో పరిశీలించిన అధికారులు గ్రామాల వారీగా జాబితాను తయారు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో కమిటీ ద్వారా అనుమతులు ఇస్తూ పట్టాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

కొన్నేళ్లుగా పోడుసాగు..

జిల్లాలో కొన్నేళ్లుగా రైతులు పోడు వ్యవసాయం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలోని భూముల్లో ఈ వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. ఏళ్ల తరబడి సాగుచేస్తున్న రైతులు తమకు భూములపై హక్కులు కల్పించాలని పలు దఫాలు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. 2005లో ఇచ్చిన విధంగానే అటవీ హక్కుల చట్టం కింద తమకు కూడా హక్కులు కల్పించాలని కోరారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు రెండో దఫా హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సంవత్సరంన్నర క్రితం ఈ పోడు భూములు సాగు చేస్తున్న రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వీటి కోసం గ్రామ, మండల, డివిజన్ స్థాయితో పాటు జిల్లాస్థాయిలో కమిటీలను వేసింది.

మండలాల వారీగా దరఖాస్తుదారుల వివరాలు

భూపాలపల్లి	5,027
చిట్యాల	1,007
గణపురం	252
కాటారం	1,582
మహదేవపూర్	4,042
మహాముత్తారం	6,780
మల్హర్	3,307
పలిమెల	1,830
రేగొండ	1,224
టేకుమట్ల	343
మొత్తం	25,394

150 ఆవాసాల నుంచి దరఖాస్తులు

జిల్లాలో 11 మండలాల పరిధిలో 150 ఆవాసాలు, గ్రామాల నుంచి పోడు పట్టాలకు దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 25,394మంది రైతులు పోడు భూముల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తంగా దరఖాస్తుల ఆధారంగా సుమారు 60వేల ఎకరాలలో అధికారులు ఐదు నెలల క్రితం సర్వే నిర్వహించారు. ప్రభుత్వం రెవెన్యూశాఖ ద్వారా ఇచ్చిన ప్రత్యేక యాప్ ద్వారా ఈ సర్వే కొనసాగించారు. అటవీ, రెవెన్యూ రిజర్వ్ ఫారెస్ట్ ఇతర భూముల వివరాలను పరిశీలిస్తూనే పోడు సాగుచేస్తున్న భూముల వివరాలను నమోదు చేశారు. గ్రామస్థాయిలో నియమించిన కమిటీల ద్వారా గ్రామసభలను నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సభలోనే ప్రకటించారు. అర్హులైన వారి భూముల వద్దకు వెళ్లి సర్వే నిర్వహించారు. మొత్తం వివరాలను యాప్‌లో నమోదు చేయడంతో పాటు ప్రభుత్వానికి నివేదించారు. అర్హులైన వారికి పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

2005కు ముందు సాగుకు హక్కులు

రాష్ట్రంలో అటవీ హక్కుల చట్టం కింద పోడు సాగు చేస్తున్న భూములకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 2005లో హక్కులు కల్పించారు. రెండో విడత ఇచ్చేందుకు కూడా 2005కు ముందు సాగుచేస్తున్న రైతులకు హక్కులు కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. జిల్లాలో 2005 తర్వాత అటవీ ప్రాంతంలో సాగుచేసిన ఆ భూములకు మాత్రం పట్టాలు ఇవ్వొద్దని కోరింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే సర్వే నిర్వహించారు. గ్రామసభల్లో ప్రకటించడంతో పాటు పోడు భూముల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన వారి వివరాలను నమోదు చేశారు. కొన్నిచోట్ల పోడు భూముల హక్కుల కోసం ఒత్తిళ్లు వచ్చినా నిబంధనల మేరకు నమోదు కొనసాగించారు. జిల్లాలో 2005 తర్వాత అటవీ ప్రాంతంలో ఎక్కువ మొత్తంలో పోడు జరిగింది. ఆ భూముల కోసం దరఖాస్తులు వచ్చిన వాటికి ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వలేదు. గ్రామాల్లో వచ్చిన వివరాలకు అనుగుణంగా నమోదు చేశారు. ఎవరికైనా ఇబ్బందులు ఉంటే ఆర్డీఓ స్థాయిలో అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు.

మరో దఫా దరఖాస్తుల పరిశీలన

ఈ నెల 10నుంచి 17 మధ్య రాష్ట్రవ్యాప్తంగా పోడు భూములకు పట్టాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో జిల్లా అధికారులు మరో దఫా దరఖాస్తుల పరిశీలన మొదలుపెట్టారు. ఇప్పటివరకు చేసిన వాటిని మరోదఫా పరిశీలిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో ఈ పరిశీలన పూర్తిచేసి అర్హులైన వారి వివరాలను గ్రామాల వారీగా ప్రకటించనున్నారు. పోడు భూముల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోడు రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడడంతో పాటు రిజర్వ్ ఫారెస్టు భూముల్లో హక్కులు కల్పించకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 8వ తేదీలోపు దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి 10వ తేదీ తర్వాత పట్టాలు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

40 ఏళ్లుగా సాగు చేస్తున్న..



40 ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటున్నాం. గతంలో అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది కానీ మాకు పట్టాలు రాలేదు. ఈ సారైనా వస్తాయని అనుకుంటున్నాం. అధికారులు సర్వే చేసుకొని పోయారు. ఈ సారైనా అర్హులకు న్యాయం చేయాలని కోరుతున్నాం. ప్రభుత్వం పట్టాలు ఇస్తామనడంతో సంతోషంగా ఉంది.

- చీకట్ల లింగయ్య, పోడు రైతు, కనుకునూరు

న్యూస్‌రీల్

భాషా పండిట్‌ల నిరసన



భూపాలపల్లి అర్బన్: భాషా పండిట్‌లకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పండిత, పీఈటీ ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కోర్టు కేసులతో సంబంధం లేకుండా ప్రభుత్వం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడ్డం లక్ష్మయ్య, లింగయ్య, రమేష్, దిల్షాద్, ప్రతాప్, రాములు, రాజారాం, విజయ్‌కుమార్, భాస్కర్, శరత్‌బాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: జిల్లాలో అర్హతగల ప్రైవేట్ పాఠశాలల నుంచి 2023–24 సంవత్సరానికి గాను బెస్ట్ అవలబుల్ స్కీం కింద దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాలల యాజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల పాఠశాలల యజమానులు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందించాలన్నారు.

పల్లెల్లో ‘బెల్టు’తో బెంబేలు!

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు వెలుస్తున్నాయి. నియంత్రించే అధికారులే చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో నిరుపేదలు అధిక ధరలకు మద్యం కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం టెండర్ ద్వారా కాళేశ్వరంలో రెండు మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. మద్యం దుకాణాల ద్వారా నిత్యం కాళేశ్వరం, పూస్కుపల్లి, మెట్‌పల్లి, మద్దులపల్లి, అన్నారం, చంద్రుపల్లి, నాగేపల్లి, పలుగుల, కుంట్లం గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ఈ గ్రామాల్లో విచ్చలవిడిగా కిరాణ దుకాణాల్లోనే బెల్టు దుకాణాలు వెలుస్తున్నాయి. దీంతో కూలీ చేసుకునే సామాన్యులు అధిక ధరలకు మద్యం విక్రయించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఎక్సైజ్, పోలీస్ అధికారులు మాత్రం ‘మామూలు’గా తీసుకుంటూ అటువైపు చూడడం లేదని విమర్శలు ఉన్నాయి.

కోటగుళ్ల సందర్శన



గణపురం: గణపురం మండలకేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్లను హైదరాబాద్ కేంబ్రిడ్జి విద్యార్థుల బృందం శనివారం సందర్శించింది. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే కాకతీయ దర్శన్ కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. వరంగల్ టూరిస్ట్ అసిస్టెంట్ ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్ ఆలయ చరిత్రను శిల్ప సంపద విశిష్టతను విద్యార్థులకు వివరించారు. వారివెంట సేవా టూరిజం వాలంటీర్లు జగదీష్, మహేష్ ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరం ప్రవేశం పొందిన పీజీ మొదటి సెమిస్టర్ విద్యార్థులు పోటీ పరీక్షల ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు శనివారం తెలిపారు. ఎస్సై, కానిస్టేబుల్, గ్రూప్–1, 2, 3, 4 తదితర పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు ఈనెల 13వ తేదీలోపు సంబంధిత విభాగాల అధిపతుల సంతకంతో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కేయూలో పోటీ పరీక్షల శిక్షణ సంచాలకులు డాక్టర్ టి.నాగయ్యకు దరఖాస్తులు సమర్పించాలని, ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపస్‌లోని ఫిజిక్స్ విభాగంలో గల సెమినార్ హాల్‌లో తరగతులు ఉంటాయని తెలిపారు. దీనికి సంబంధించిన దరఖాస్తులను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభ

‘కార్పొరేట్’లకు కొమ్ముకాస్తున్న మోదీ

కేయూలో విద్యార్థుల దీక్ష

- 10లో▸

ఆపరేషన్ స్మైల్ విజయవంతం

- 37మంది బాల కార్మికులకు విముక్తి
- ఎస్పీ సురేందర్‌రెడ్డి



సురేందర్‌రెడ్డి, ఎస్పీ

భూపాలపల్లి: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ స్మైల్–9 కార్యక్రమం జిల్లాలో విజయవంతమైందని ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 1వ తేదీ నుంచి 31వరకు ఆపరేషన్ స్మైల్–9 కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 37మంది బాలకార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చి యజమానులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఆపరేషన్ స్మైల్ విజయవంతం కోసం ఒక్కో సబ్ డివిజన్ పరిధిలో ఒక ఎస్సై, ముగ్గురు కానిస్టేబుల్స్‌ను ప్రత్యేకంగా కేటాయించామని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు సహకారం అందించారని చెప్పారు. ఎవరైనా బాలలతో పని చేయిస్తున్నా, తప్పిపోయినా, వదిలివేయబడిన బాలల సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

‘ట్రైబల్స్‌కు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వాలి’

ఏటూరునాగారం: షెడ్యూల్ ఏరియాలో షెడ్యూల్ ట్రైబల్స్‌కు మాత్రమే ఉద్యోగ అవకాశాలు, పదోన్నతులు కల్పించాలని ట్రైబల్ టీచర్స్ యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట శనివారం ప్లకార్డులను చేతపట్టుకుని పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ధర్నాకు దిగారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏపీఓ వసంతరావుకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఉద్యోగ బదిలీలు మైదానం, ఏజెన్సీ ప్రాంతాలకు విడివిడిగా చేపట్టాలన్నారు. గిరిజన సంక్షేమశాఖలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాంచందర్‌రావు

కాటారం: యువత, విద్యార్థులు చెడు వ్యసనాలు, చెడుమార్గాలకు దూరంగా ఉండి సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలని జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాంచందర్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ క్యాన్సర్‌డేను పురస్కరించుకొని క్యాన్సర్, న్యాయచట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి రాంచందర్‌రావు మాట్లాడుతూ గుట్కా, పొగాకు, గంజాయి ఆరోగ్యానికి హానికరమన్నారు. మత్తు పదార్థాలను తీసుకోవడం కారణంగా క్రమేణా ఆరోగ్యం క్షీణించి క్యాన్సర్ సోకే ప్రమాదం ఉంటుందని చెప్పారు. ప్రాణానికి హాని చేకూర్చే వాటికి యువత దూరంగా ఉండాలని చెప్పారు. పట్టుదలతో చదివి ఉన్నతస్థానంలో నిలవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించినప్పుడు నేరాలు నియంత్రించబడుతాయని అన్నారు. చట్టప్రకారం ముందుకెళ్తే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని వివరించారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన అణగారిన వర్గాలకు న్యాయ సేవా అధికారి సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సహాయం అందించనున్నట్లు చెప్పారు. బడుగు బలహీన వర్గాలు, పేదలు, మహిళలు, చిన్నపిల్లలు, కార్మికులకు ఉచితంగా అందించే న్యాయసేవలపై గ్రామాల్లో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ గడ్డం రాంమ్మోహన్‌రెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసచారి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాటారం సీఐ రంజిత్‌రావు, సర్పంచ్ తోట రాధమ్మ, ఎస్సై శ్రీనివాస్, ఎంపీటీసీ జాడి మహేశ్వరి, వైద్యురాలు మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సల్లంగ సూడు తల్లీ.. మళ్లొస్తం

- ముగిసిన మినీ మేడారం జాతర

మండమెలిగె వేడుకతో మొదలైన మినీ మేడారం జాతర శనివారం ఘనంగా ముగిసింది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో మేడారం పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. భక్తులు ఎత్తుబంగారం, ఎదురుకోడి, తలనీలాలు సమర్పించి తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. నాలుగురోజులు చెట్ల కింద విడిది చేసిన భక్తులు సల్లంగ సూడు తల్లీ మళ్లొస్తాం అంటూ తిరుగు ప్రయాణమయ్యారు.

- ఎస్ఎస్ తాడ్వాయి

- 8లో▸



సమ్మక్క గద్దె వద్ద మొక్కు చెల్లిస్తున్న భక్తులు



ఎత్తు బంగారంతో తరలివస్తున్న భక్తులు



గంటకొడుతూ..



మూలికలు విక్రయిస్తున్న కోయదొర

గుడిసెవాసుల ధర్నా



మాట్లాడుతున్న నాయకులు



ధర్నాకు హాజరైన గుడిసెవాసులు

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని పాత ఎర్ర చెరువులో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం గుడిసెవాసులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రెండు వేల మందితో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి తహసీల్దార్ ఇక్బాల్‌కు వినతిపత్రం అందజేశారు. గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికీ పట్టాలిచ్చి ఇంటి నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సోత్కు ప్రవీణ్‌కుమార్, క్యాతరాజ్ సతీష్, కుడుదల వెంకటేష్ మాట్లాడుతూ.. పేదలకు భూములు దక్కింతే వరకు పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీకాంత్, నేరెళ్ల జోసెఫ్, రాజేశ్వరి, మహేందర్, పవన్, రఘుపతి, తిరుపతి పాల్గొన్నారు.

రామప్పలో పర్యాటకుల సందడి



రామప్పను సందర్శిస్తున్న భక్తులు

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని పాలంపేటలో గల రామప్ప దేవాలయంలో విద్యార్థులు, పర్యాటకుల సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు రామప్ప ఆలయంలో ఏటు చూసినా భక్తులు, పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించగా ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా పర్యాటకులు ఆసక్తిగా విని ఆనందం వ్యక్తం చేశారు. ఆలయంలో ఉత్సాహంగా కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కలిసి పర్యాటకులు ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకుని పర్యాటక శాఖ బోట్లలో బోటింగ్ చేసి సరస్సు అందాలను తిలకించారు.

కొనసాగుతున్న దీక్ష



శిబిరంలో మాట్లాడుతున్న కర్ణాకర్

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాల రద్దుచేయాలని కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక జర్నలిస్టులు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది. శనివారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఎంఎస్పీ నాయకులు అంబాల చంద్రమౌళి, గట్ల రాజన్న, ఎస్ఎస్‌యూఐ నాయకులు బట్టు కర్ణాకర్, సురేష్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర నాయకులు గాడిపల్లి మధుగౌడ్, కంకణాల సంతోష్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వాస్తు పేరుతో జర్నలిస్టులకు కేటాయించిన ప్లాట్లను వెనక్కితీసుకోవాలని చూస్తుందన్నారు. జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేస్తున్న కలెక్టర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ కార్యాలయానికి ఏర్పాటుచేసి రోడ్డుతో జర్నలిస్టులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జర్నలిస్టులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో జర్నలిస్టులు ప్రభాకర్, నర్సయ్య, రమేష్, శ్యాం, శ్రీనివాస్, రవిభాస్కర్, చంద్రశేఖర్, శ్రీధర్, వంశీ, సతీష్, చందు, నరేందర్ పాల్గొన్నారు.

సమీక్షలు లేవు.. ప్రచారం లేదు?

- 17నుంచి కాళేశ్వరంలో శివరాత్రి ఉత్సవాలు
- ఆందోళనలో భక్తులు

కాళేశ్వరం: ఈనెల 17నుంచి 19వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల ప్రచారంపై నీలినీడలు కమ్ముకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ప్రతి ఏడాది శివరాత్రికి 20రోజుల ముందుగానే జిల్లాస్థాయి నుంచి కిందిస్థాయి అధికారుల హడావుడి కనిపించేది. కానీ ప్రస్తుతం శివరాత్రి 12రోజులు కూడా లేకపోవడంతో అధికారులు అంతగా పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వస్తున్నాయి. గతంలో నెల రోజుల ముందుగానే కలెక్టర్, ఎమ్మెల్యే, ఆర్డీఓ స్థాయిలో సమీక్షలు చేసేవారు. శివరాత్రి ఉత్సవాలకు కావాల్సిన ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులతో చర్చించి త్వరగా పూర్తి చేసేవారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సుమారుగా మూడు రోజుల్లో లక్షకుపైగా త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసి స్వామివార్లను దర్శించుకుంటారు. కానీ ఇప్పుడు ఎలాంటి సమీక్షలు చేయకపోవడం.. ప్రచారం కూడా అంతగా కనిపించకపోవడం ఉత్సవాల తీరు, నిర్వహణ ఎలా ఉంటుందని భక్తులు సందేహం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై ఈఓ మహేష్‌ను సంప్రదించగా.. రెండు రోజుల్లో కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్‌తో సమీక్ష జరిపేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

మృతదేహం గుర్తింపు

రాయపర్తి: మండలంలోని మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు కొట్టుకొచ్చిన మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై బండారి రాజు తెలిపారు. శనివారం మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెర్కవేడుకు చెందిన ఇజ్జగిరి సాంబయ్య ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి తన కుటుంబంతో సహా నర్సంపేటకు బతుకుదెరువు కోసం వెళ్లాడు. సాంబయ్య పెద్దకుమారుడు మృతుడు ఇజ్జగిరి రాజు(31)ను ఏమీ పని చేయడంలేదని తండ్రి మందలించడంతో జనవరి 31న ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా ఆవేశంతో బయటకు వెళ్లాడు. మరుసటి రోజు ఇంటికి రాకపోవడంతో నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మైలారం రిజర్వాయర్‌లోకి మృతదేహం కొట్టుకువచ్చినట్లు సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా గుర్తించి నిర్ధారణ చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

టేకుమట్ల(రేగొండ): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని దమ్మన్నపేటలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలంలోని పోచంపల్లికి చెందిన కేతిరి క్రాంతికుమార్(40) దమ్మన్నపేటకు చెందిన మిత్రుడు శ్రీనివాస్ సమీప బంధువు ఇంట్లో భార్యాభర్తల గొడవ నేపథ్యంలో ఈ నెల 3న గోదావరిఖనికి వెళ్లారు. తిరిగి దమ్మన్నపేటకు వచ్చేలోగా అర్ధరాత్రి కావడంతో అదే వాహనంలో క్రాంతి కుమార్ పడుకున్నాడు. శనివారం ఉదయం వాహనంలో క్రాంతికుమార్ మృతి చెంది ఉండడాన్ని గుర్తించిన శ్రీనివాస్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పరకాల మార్చురీకి తరలించారు. కాగా, కేతిరి క్రాంతికుమార్ మృతిపై అనుమానంతో భార్య రజిత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఆత్మహత్య

కాజీపేట రూరల్: కాజీపేట -కోమటిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గల వడ్డెపల్లి చెరువు సమీపంలో రైల్వే ట్రాక్‌పై శనివారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ దయాసాగర్ వివరాల ప్రకారం.. కిలోమీటర్ నంబర్ 363/10-12 మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని సుమారు 30 ఏళ్ల వయస్సు గల వ్యక్తి రెండు ముక్కలుగా పడి ఉన్నాడు. మృతుని కుడిచేతిపై అమ్మ, ఎడమ చేతిపై పీఆర్ అని పచ్చబొట్టు రాసి ఉందని, ఎరుపు రంగు షర్టు, నీలం రంగు జీన్స్‌ప్యాంట్ ధరించినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తల్లులారా.. మళ్లొస్తం

ముగిసిన మినీ మేడారం



- నాలుగు రోజుల పాటు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన గద్దెల ప్రాంగణాలు



క్యూలో భక్తుల సందడి



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు





ఎత్తు బంగారం(బెల్లం)తో తరలివస్తున్న భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: మినీ మేడారం జాతర ఘనంగా ముగిసింది. నాలుగు రోజుల పాటు భక్తులు వన దేవతలకు తీరుబడిగా మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడాయి. జంపన్నవాగు మొదలు గద్దెల వరకు, అక్కడి నుంచి చిలకలగుట్ట వరకు వాహనాలతో నిండిపోయింది. మినీ జా తర (మండమెలిగె పండుగ)తో నాలుగు రోజుల పాటు మేడారం భక్తులతో కళకళలాడింది.

నాలుగు రోజులు ఘనంగా..

బుధవారం మండమెలిగే వేడుకతో మొదలైన మినీ మేడారం జాతర శనివారం వరకు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం జరిగింది. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. వీటికి అదనంగా స్వంత వాహనాల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి బారులుదీరారు. జంపన్న వాగు స్నానఘట్టాల్లో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేశారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా చేశారు. మేడారం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరావు, జంపన్న వసతి సముదాయాలు భక్తులతో నిండిపోయాయి. ఇవి కాకుండా రెడ్డిగూడెం, ఇంగ్లిష్ మీడియం స్కూల్ పరిసర ప్రాంతాల్లోనూ భక్తులు బస చేశారు.

కొనసాగుతున్న భక్తుల రాక

బుధవారం మొదలైన జాతర శనివారంతో ముగిసినప్పటికీ ఆదివారం మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని వన దేవతలను దర్శనం చేసుకునేందుకు భక్తులు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా పౌర్ణమి, వీకెండ్ కలసి రావడంతో హైదరాబాద్ నుంచి వివిధ ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో మేడారానికి చేరుకుంటున్నారు. దీంతో మినీ జాతర ముగిసినా మేడారంలో భక్తుల కోలాహలం తగ్గలేదు.

తనివితీరా మొక్కులు

కరోనా కారణంగా చాలా మంది భక్తులు గత జాతర సందర్భంగా మేడారం వచ్చేందుకు సంశయించారు. ప్రస్తుతం కరోనా భయం తగ్గిపోవడంతో మినీ మేడారం జాతరకు ఈసారి భక్తులు పోటెత్తారు. వన దేవతలకు తనివితీరా మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల ప్రాంగణంలో నిలువెత్తు బంగారం, ఒడి బియ్యం సమర్పించారు. యాటలు, కోళ్లను తల్లులకు సమర్పించి, మొక్కులు చెల్లించారు.

తిరుగువారం పండుగ

మేడారం మినీ జాతర ముగిసిన తర్వాత ఈనెల 8వ తేదీన (బుధవారం) సమ్మక్క సారలమ్మ పూజారులు తిరుగువారం పండుగ నిర్వహించనున్నారు. మేడారంలోని సమ్మక్క గుడిలో, కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో పూజారులు తిరుగువారం పండుగ పూజలు చేస్తారు. అమ్మవార్ల ఆలయాలను శుద్ధి చేసి దూపాదీపాలు వెలిగించి యాటలను మొక్కుగా సమర్పిస్తారు. తిరుగువారం పండుగతో పూజలు పరిసమాప్తం కానున్నాయి.

పకడ్బందీ ఏర్పాట్లు

మినీ జాతరకు జిల్లా యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేసింది. దేవాదాయ, మెడికల్, ఐసీడీఎస్, ఐటీడీఏ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఆధ్వర్యంలో సిబ్బందికి జాతర విధులు అప్పగించారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ కంట్రోల్ బాధ్యతల్లో నాలుగు వందల మందికి పైగా పోలీసులు పాల్గొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం జిల్లా నుంచే కాకుండా ఆంధ్ర నుంచి కూడా కార్మికులను రప్పించారు.

పారిశుద్ధ్య సేవలు భేష్



పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో డీపీఓ వెంకయ్య పర్యవేక్షణలో జాతరలో పారిశుద్ధ్య కార్మికులు ఎక్కడా లోపాలు తల్లెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సేకరించిన చెత్తచేదారాన్ని డంపింగ్ యార్డులకు తరలించారు. జాతరలో కార్మికులు అందించిన పారిశుద్ధ్య సేవలను భక్తులు, అధికారులు మెచ్చుకున్నారు. మినీ జాతర ముగిసిన మరో వారం రోజుల పాటు పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటామని డీపీఓ వెంకయ్య తెలిపారు. అంతేకాకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతరలో మూడు శిబిరాల ద్వారా తప్పిపోయిన భక్తులను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వెలవెలబోయిన 'హరిత'

మినీ జాతరకు వచ్చిన భక్తులతో మేడారం పరిసర ప్రాంతాలు కళకళలాడితే కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన హరితా హోటల్ వెలవెలబోయి కన్పించడం గమనార్హం. గదుల ధర అధికంగా ఉండటం, నిర్వహణ లోపాలు, సరైన ప్రచారం లేకపోవడంతో హరిత ప్రాంగణం వెలవలబోయింది. కనీసం క్యాంటీన్‌లో సైతం జన సందడి కనిపించలేదదంటే పరస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మినీ జాతరను పురస్కరించుకుని ఇక్కడ నిర్మించిన అంఫీ థియేటర్‌లో ఏమైనా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే బాగుండేదని భక్తులు అభిప్రాయపడ్డారు. కాగా, గిరిజన మ్యూజియం భక్తుల సందర్శనతో సందడిగా మారింది.

సమన్వయంతో జాతర విజయవంతం



సమ్మక్క- సారలమ్మ మినీ జాతర విజయవంతమైంది. అధికారుల సమన్వయంతోనే ఇది సాధ్యమైంది. మినీ జాతరలో సేవలందించిన జిల్లా అధికారయంత్రానికి ప్రత్యేక కృతజ్ఞతలు. నేడు (ఆదివారం) మాఘశుద్ధ పౌర్ణమి రోజు కావడంతో భక్తులు భారీగా తరలి రానున్నారు.

– సిద్దబోయిన జగారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

ఏ ముఖం పెట్టుకుని పాదయాత్ర చేస్తవ్..

- రేవంత్ రెడ్డిని ప్రశ్నించిన రెడ్ కో ఛైర్మన్ సతీష్‌రెడ్డి
- ములుగులో 6న రేవంత్‌రెడ్డి యాత్ర ప్రారంభం

హన్మకొండ: ములుగు నుంచి పాదయాత్ర చేయాలనుకుంటున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి.. ఇక్కడి ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని రెడ్‌కో చైర్మన్ వై.సతీష్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపీగా ఏనాడైనా జిల్లా అభివృద్ధిపై పార్లమెంట్‌లో మాట్లాడినవా..? ములుగుకు ప్రత్యేకంగా ఏమైనా నిధులు అడిగినవా..? పదేళ్ల రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మేడారానికి జాతీయ హోదా ఎందుకు ఇయ్యలేదు..? ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని పాదయాత్ర చేస్తావని ఆయన ఒక ప్రకటనలో తూర్పారబట్టారు. రామప్ప అభివృద్ధి, ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఎనాడైనా కేంద్రాన్ని నిలదీశావా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే సీతక్క రామప్ప అభివృద్ధి విషయంలో జరుగుతున్న అన్యాయంపై, మేడారం పండుగకు జాతీయ హోదా, గిరిజన యూనివర్సిటీపై రాహుల్ గాంధీతో పార్లమెంట్‌లో ఎందుకు అడిగించలేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిది ఐరన్ లెగ్ అని సీతక్క గ్రహించాలని సూచించారు.

అమెరికా వెళ్లేందుకు.. ఆస్తి తీసుకున్నాడు

- గిరిజనుల భూమి బదలాయించుకున్న వైనం

రఘునాథపల్లి: అమెరికా వెళ్లేందుకు ప్రాపర్టీ కోసం గిరిజనుల వ్యవసాయ భూమి బదలాయించుకొని, తిరిగి రిజిస్ట్రేషన్ చేయక పోగా, మరొకరికి విక్రయించి సదరు వ్యక్తికి భూమి చూపకుండా మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వీరేందర్ శనివారం తెలిపారు. జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్ గ్రామానికి చెందిన అనుమాండ్ల కిరణ్‌కుమార్‌రెడ్డి అమెరికా వెళ్లేందుకు ప్రాపర్టీ అవసరం కాగా, మండలగూడెం పరిధిలోని పోతరాజుతండాకు చెందిన గిరిజనులను నమ్మించి ఐదు ఎకరాల వ్యవసాయ భూమి తన పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఒప్పందం ప్రకారం ఆరు నెలలకు తిరిగి వారి భూములు వారికే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా దుర్బుద్ధితో హైదరాబాద్‌కు చెందిన మల్లికార్జున్ అనే వ్యక్తికి అట్టి భూములు విక్రయించి రిజిస్ట్రేషన్ చేశాడు. కొనుగోలు చేసిన మల్లికార్జున్‌కు భూములు చూపకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కిరణ్‌కుమార్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఇదే కేసులో గిరిజనులను నమ్మించి వారి భూములు రిజిస్ట్రేషన్ చేసుకొని తిరిగి బదలాయించకుండా ఇతరులకు విక్రయించాడని బాధిత గిరిజనుల ఫిర్యాదు మేరకు రెండు నెలల క్రితం కిరణ్‌కుమార్‌రెడ్డిపై మరో రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

- బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
- ఇద్దరు మిత్రులు దుర్మరణం



ప్రశాంత్(ఫైల్)



నవీన్(ఫైల్)

కొడకండ్ల: చిన్ననాటి నుంచి పదో తరగతి వరకు కలిసి చదువుకున్న ఇద్దరు ప్రాణ మిత్రులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు వదిలారు. వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలిన ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండా శివారు పెట్రోల్ పంపు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం పణిగిరి గ్రామానికి చెందిన నాతి ప్రశాంత్(19), బొడ్డు నవీన్ (20)లు గ్లామర్ బైక్‌పై జనగామ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో గిర్నితండా పెట్రోల్ పంపు సమీపంలో ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు ఎగిరిపడిపోయారు. తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం కావడంతో ఇద్దరు మిత్రులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై కొమురెల్లి సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా.. చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్న మిత్రులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నియామకం



రవికృష్ణ గౌడ్

హన్మకొండ: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రవి కృష్ణను నియమించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న హనుమకొండలోని వడ్డేపల్లికి చెందిన బైరి రవికృష్ణను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బైరి రవికృష్ణ మాట్లాడారు. పది సంవత్సరాలుగా వివిధ హోదాల్లో బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తనను నియమించిన జాజుల శ్రీనివాస్ గౌడ్‌తోపాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు.

పాలన చేతకాకుంటే పారిపోవాలి..

- బీఆర్ఎస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి..
- వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



కొంకపాకలో పాదయాత్ర చేస్తున్న షర్మిల

పర్వతగిరి/సంగెం: మీకు దమ్ము, ధైర్యం ఉంటే మంచి పాలన అందించాలని, పాలన చేతకాకపోతే వదిలి పారిపోవాలని వైఎస్సార్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ప్రజా ప్రస్థానం పాదయాత్ర సందర్భంగా శనివారం మండలంలోని చౌటపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పర్వతగిరి మండలంలో పాదయాత్ర సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు వైఎస్సార్ టీపీ ఫ్లెక్సీలను చించివేయడం, ఇటీవల జర్నలిస్టులపై దాడులు చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నాయకులకు చాలెంజ్ విసురుతున్నానని, మీ దాడులకు వైఎస్సార్ బిడ్డ భయపడదన్నారు. మేము చేస్తున్న ఆరోపణల్లో తప్పులు ఉంటే పబ్లిక్ ఫోరం పెట్టాలని, మీడియా, ప్రతిపక్షాలను పిలిపిద్దామా.. అంటూ సవాల్ విసిరారు. అధికారం ఉంది కదా, పోలీసులు ఉన్నారు కదా.. అని దాడులు చేస్తే ఊరుకోమని, మా జోలికొస్తే ఇంకా గట్టిగా మాట్లాడుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉండాలని హితవుపలికారు. రాష్ట్రంలో ప్రజల కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యేలు ఎవరూ లేరన్నారు. ఎమ్మెల్యే అరూరి రమేష్ భూకబ్జాలు వాస్తవాలు కాదా.. అని, ఆయనపై చేసిన ఆరోపణలు ప్రజలు చెప్పినవేనన్నారు. భూములు ఇవ్వకపోతే థర్డ్ డిగ్రీలు ప్రయోగించడం వాస్తవం కాదా.. అంటూ ప్రశ్నించారు. స్వయంగా మంద కృష్ణ మాదిగ భూములు కూడా ఎమ్మెల్యే అరూరి కబ్జా చేయాలనుకోవడం వాస్తవం కాదా.. అని నిలదీశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు సర్పంచ్‌ల పక్షాన ఏరోజైనా నిలబడ్డారా.. అనే విషయాన్ని తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా అమరేందర్‌రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు నాడెం శాంతికుమార్, మల్లేశంగౌడ్, అప్పం కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: వరంగల్ మహానగరం నక్కలపెల్లిలో ఆదివారం ఉదయం 9గంటలకు వైఎస్ఆర్‌టీపీ అధినేత వైఎస్ షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్ర ప్రారంభమవుతుందని రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా అమరేందర్‌రెడ్డి శనివారం తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్



మరిపెడలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘు

మరిపెడ: అక్రమంగా తరలిస్తున్న 20కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తొర్రూర్ డీఎస్పీ రఘు మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో శనివారం వెల్లడించారు. మండలంలోని పురుషోత్తమాయగూడెం స్టేజీ వద్ద రోడ్డుపై పోలీసులు తనిఖీ చేస్తుండగా ముగ్గురు అనుమానంగా కనిపించడంతో విచారించి, వారి వద్ద రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని కుక్కల తండాకు చెందిన బానోతు రమేష్, దూబ్లా అను పా డేరు ప్రాంతం నుంచి రెండు కిలోల గంజాయి తీసుకొచ్చిన విషయాన్ని ఇస్లావత్ హనుమకు చెప్పారు. గంజాయిని రూ.10వేలకు కిలో చొప్పున హనుమ కు అప్పగించి మాట్లాడుతున్న క్రమంలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వివరించారు. సమావేశంలో సీఐ సాగర్, ఎస్సై పవన్ పాల్గొన్నారు.

హసన్‌పర్తి: హనుమకొండ నగరంలోని పెగడపల్లి డబ్బాల ప్రాంతంలో సుమారు రూ.26వేలు విలువ గల గంజాయిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శనివారం పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, ఓ బైక్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.14,200 స్వాధీనం చేసుకున్నారు. హనుమకొండ న్యూశాయంపేటకు చెందిన సాంబరాజు హేమంత్, జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలం సూరంపేట వాసి మంతిని శ్రీనివాస్‌లు ఓ కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ అభ్యసిస్తున్నాడు. కోడిమ్యాలకు చెందిన మల్లేశం వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నారు. కాగా, పెగడపల్లి డబ్బాల వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మల్లేశం పరారీలో ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ తెలిపారు. ఈ దాడుల్లో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై లవన్‌కుమార్, నిశార్ పాల్గొన్నారు.

వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో..

రామన్నపేట: వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం ఒకరి నుంచి 500 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే స్టేషన్ సమీపంలో ఎస్సై శివకుమార్, కానిస్టేబుల్‌లు భిక్షపతి, శశికుమార్‌లతో కలిసి తనిఖీలు నిర్వహించగా ఓ యువకుడు చేతిలో కవర్ పట్టుకుని అనుమానాస్పదంగా కనిపిస్తూ తప్పించుకునే ప్రయత్నం చేయగా పట్టుకున్నట్లు తెలిపారు. అతడి వద్ద రూ.10వేల విలువ చేసే గంజాయి లభించినట్లు పేర్కొన్నారు. దీంతో అతడిని విచారించగా గోవిందరాజుల గుట్ట ప్రాంతానికి చెందిన ఎండీ అజార్ అని తెలిసిందని తెలిపారు. అజార్ ఏడాది కాలంగా రైల్వే స్టేషన్ ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడని వెల్లడించారు. దీంతో అజార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ మల్లేష్ తెలిపారు.